క్లుప్తంగా

బీజేపీ జాతీయ మండలి సమావేశంలో నామాజీ



నారాయణపేట రూరల్: ఢిల్లీలో శనివారం జరిగిన బీజేపీ జాతీయ మండలి సమావేశంలో రాష్ట్ర బీజేపీ నాయకులు, పేట వాసి నాగురావు నామాజీ పాల్గొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర కో– షాధికారి శాంతకుమార్ ఆధ్వర్యంలో పాల్గొని జిల్లాలో రాజకీయ పరిస్థితిపై మాట్లాడారు. అందరు కలిసికట్టుగా పనిచేసి పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేసి గెలిపిస్తామని చెప్పారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ పీఎంగా మోదీని చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత




మరికల్: రాకొండ సమీపంలోని కోయిల్‌సాగర్ వాగులో నుంచి రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్‌ను స్పెషల్ పార్టీ పోలీసులు పట్టుకున్నారు. గతరెండు రోజుల నుంచి టిప్పర్ల ద్వారా రాత్రి వేళలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడికి సంబంధించిన టిప్పర్‌ను శుక్రవారం అర్ధరాత్రి స్పెషల్ పార్టీ పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. పట్టుపడ్డ టిప్పర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేశారు. అనంతరం తహసీల్దార్ సునీత రూ. 25 వేల జరిమాన విధించినట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

భద్రాచలంలో పల్లెగడ్డ సేవ బృందం



మరికల్: మండలంలోని పల్లెగడ్డకు చెందిన టీటీడీ సేవ బృందం సభ్యులు శనివారం నుంచి భద్రాచలంలో సేవ కార్యక్రమాలను చేపట్టారు. అక్కడ దర్శన నిమిత్తం వచ్చే భక్తులను క్యూలైన్‌లో పంపించడం, అన్నదానం సత్రాల వద్ద సేవ చేయడంతోపాటు భక్తుల సౌకర్యం కోసం ప్రసాదాలను తయారు చేయనున్నట్లు టీటీడీ ధర్మ ప్రచార కర్త శ్రీరాములు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పలు ఆలయాల్లో తమ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం



మరికల్: మండలంలోని పల్లెగడ్డలో శివ పార్వతి నాట్య మండలి ఆధ్వర్యంలో ఘనంగా సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటిక ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం రాత్రి ప్రారంభించిన ఈ నాటిక ప్రదర్శనలో కళాకారులు తమ పాత్రలో ఒదిగి నటించారు. శనివారం తెల్లవారు వరకు జరిగిన నాటిక ప్రదర్శనలో పాత్రదారులు పోటీపడి ప్రదర్శన చేయడంతో గ్రామస్తులను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను అభినందించి సత్కారించారు.

రైలు ఢీకొని మూగజీవాలు మృతి

మాగనూర్: మండల కేంద్రంలోని చిన్నవాగు వంతెనపై నాలుగు మూగజీవాలు మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. మండలానికి చెందిన మాదారం మారెప్ప తన వ్యవసాయ పొలం వద్ద మూగజీవాలను కట్టేసేవాడు. శుక్రవారం అలాగే కట్టేసి వచ్చినట్లు తెలిపారు. అయితే రాత్రి సమయంలో తాడు తెంచుకుని రైల్వే ట్రాక్‌పై వెళ్తున్న సమయంలో గూడ్స్ రైలు ఢీకొట్టింది. అయితే వీటితో పాటు గ్రామంలోని శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయానికి చెందిన మరో రెండు ఎద్దులు ఒక దూడా ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డాయి. ఉదయం సమయంలో అటుగా వెళ్లిన కొందరు గమనించి రైల్వేశాఖ అధికారులకు సమాచారం అందించడంతో సిబ్బంది వాటిని ట్రాక్‌పై నుంచి తొలగించి రైలు రాకపోకలను కొనసాగించారు.

క్రీడా దుస్తుల అందజేత

మరికల్: మండలంలోని కబడ్డీ క్రీడాకారులకు సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం క్రీడా దుస్తులను అందజేశారు. ఈ మేరకు.. సూర్యమోహన్ మాట్లాడుతూ మండల క్రీడాకారులు వివిధ క్రీడా పోటీల్లో రాణించాలనే ఉద్దేశంతోనే వారిని ప్రోత్సహించేందుకు దుస్తులను అందజేశామన్నారు.



స్త్రీనిధితో ఆర్థిక స్వావలంబన

- మండలానికో జనరిక్ ఔషధ దుకాణం
- మహిళా సంఘాలకు ఒక గొప్ప అవకాశం
- సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలు
- మహిళల పొదుపును ప్రోత్సహించేందుకు
- బ్యాంక్ లికేజీ రుణాలు సైతం

జిల్లాలో ఇలా :
జిల్లాలోని వీఓలు : **353**
మొత్తం మహిళా సంఘాలు : **8067**
ఇప్పటి వరకు మహిళా సభ్యుల సంఖ్య : **91065**



మహిళా సంఘాల శిక్షణను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నర్వ: గ్రామీణ ప్రాంతాల మహిళలు సంఘటితమయ్యేలా రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మహిళలకు ఆర్థికంగా చేయుతనందించేందుకు 2011లో ప్రభుత్వం స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ లిమిటేషన్‌ను స్థాపించింది. అతి తక్కువ సమయంలో తక్కువ వడ్డీకే రుణాలు అందించడం దీని లక్ష్యం. వంద రకాలైన ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల కోసం ఒక్కో సభ్యురాలికి రూ. 25వేల నుంచి రూ. 3లక్షల వరకు రుణం అందిస్తారు. రుణం పొందిన వారు అప్పును 24 నెలల నుంచి 60 నెలల వరకు చెల్లించాల్సి ఉంటుంది. రుణాలు అవసరమైన లబ్ధిదారులు వారి స్మార్ట్ ఫోన్‌లో స్త్రీనిధి యాప్ ద్వారా లేదా గ్రామ సంఘానికి దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని రకాలుగా నిర్ధారించుకున్న స్త్రీనిధి కార్యాలయం రుణం మంజూరు చేసి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులను జమచేస్తుంది.

స్త్రీనిధి కొత్త రుణాలు..

స్త్రీనిధిలో అక్షయ, సౌభాగ్య పథకాలతో రూ. 25వేల నుంచి రూ. 3లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. ఇందులో డెయిరీ, నాటుకోళ్ల పెంపకం, ఆటో రిక్షాలు, జనరిక్ ఔషధాల దుకాణం ఏర్పాటుకు, సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు రుణాలు అందిస్తున్నారు.

పేదల కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే చికిత్సకోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినా.. మందులు ఎక్కువగా బయటే కొనాల్సిందే. అయితే పేదలకు ఊరట కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జనరిక్ మందుల దుకాణాలను నిర్వహిస్తోంది. మహిళా సంఘాల సభ్యుల్లో అర్హులకు దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి రుణాలు ప్రోత్సహించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇందుకు రూ. 3 లక్షల రుణం అందించనున్నారు. మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల అన్ని మండలాల మహిళా సమాఖ్యలకు సమాచారం అందించినట్లు ఉన్నాతాధికారులు తెలిపారు.

మంజూరు చేయడం ఇలా..

- స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలు కావడంతో పాటు వారి కుటుంబం, దగ్గరి బంధువులో ఎవరైనా డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్యార్హత కలిగి ఉండాలని నియమం.
- రుణం పొందడానికి ముందు సభ్యురాలిగా ఉన్న సంఘం, గ్రామైక్య సంఘం తీర్మానం తప్పనిసరి.
- దుకాణం నిర్వాహణకు సంబంధిత డ్రగ్ ఇన్స్పెక్టర్ అనుమతి, ధృవీకరణ పత్రం, కొటేషన్ విద్యార్హత ధృవపత్రాలతో స్త్రీనిధి అధికారులకు దరఖాస్తు చేయాలి.
- స్త్రీనిధి అధికారులు దరఖాస్తులు పరిశీలించి అర్హులుగా బావిస్తే వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.
- జనరిక్ దుకాణంకోసం తీసుకునే రుణాన్ని ప్రతి నెలా వాయిదాల రూపంలో ఐదేళ్ల లోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇలా..

ఇప్పటి వరకు మొత్తం 3110 మహిళా సంఘాలుండగా వీటి పరిధిలో 18900 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకే ఇస్తున్న రుణాలను మహిళా సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. కుటుంబంలో ఎవరైనా విద్యార్హత కలిగి ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. సులభ వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాలి. ఆసక్తి కలిగిన సంఘాల సభ్యులు మరిన్ని వివరాలను మీ సంఘం కార్యాలయంలో సంప్రదించి తెలుసుకోవచ్చు.

– తిరుపతయ్య, స్త్రీనిధి మేనేజర్, నారాయణపేట

శాంతికుమార్‌కు ఎంపీ సీటు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస్

నారాయణపేట రూరల్: బీసీ నేత, రాష్ట్ర కో–షాధికారి శాంతికుమార్‌కు మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటును కేటాయించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో అధికంగా 60శాతం బీసీ ఓటర్లు ఉన్నారని, సీటు ఇస్తే గెలిపించుకునే బాధ్యత పార్టీతో పాటు బీసీ సంఘాలు తీసుకుంటాయన్నారు. గతంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా పనిచేసిన వారికి తిరిగి టికెట్ ఇవ్వడం కొత్తవారికి చోటు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్న శాంతికుమార్ ఎంపీ అభ్యర్థిగా తగిన వ్యక్తి అని బీజేపీ గుర్తించాలన్నారు. అదేవిధంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు సైతం బీసీలకు సీట్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సవారి సత్యం, ఆశన్న, శ్రీనివాస్, జీవీరావు, నీలప్ప, అశోక్‌కుమార్, కేశవ్‌ప్రసాద్, రవి, నరేష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యాభివృద్ధి



మాట్లాడుతున్న హెచ్‌ఎం వీరయ్య

కోస్గి: విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో మరింత విద్యాభివృద్ధి జరుగుతుందని విద్యాశాఖ జిల్లా రిసర్స్ పర్సన్ వీరు మల్లేష్ సూచించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ పరిధిలోని నాగుసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ప్రతిరోజు కొంత సమయం తమ పిల్లల చదువులకు కేటాయించి పాఠశాలలో జరుగుతున్న పాఠ్యాంశబోధన, తరగతిలో తమ పిల్లల చదువు సామర్థ్యం తెలుసుకోవడం ద్వారా జవాబుదారితనం పెరుగుతుందన్నారు. ఇంటి వద్ద చదువుకునే తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధచూపాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలలో అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీరయ్య, ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దామరగిద్ద: సమాజంలో మోసాలకు గురికాకుండా ప్రజహక్కులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ అడ్వకేట్ లక్ష్మిపతి, నాగేశ్వరి, ఎంపీడీఓ శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని వత్తుగుండ్ల, వత్తుగుండ్ల తండా గ్రామస్తులకు జిల్లా న్యాయసేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. లంబాడ హక్కులను వివరించారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు న్యాయపరంగా వారి పక్షాన న్యాయ సలహాలు సూచనలు అదించేందుకు న్యాయ సేవా అధికార సంస్థ కృషిచేస్తుందని తెలిపారు. రైతులు పురుగుమందులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో నాణ్యమైన వాటిని గుర్తించి కొనుగోలు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి గోపాల్ రైతులకు వివరించారు. బాలకార్మిక వ్యవస్థ, సేబర్‌నేరాలు వంటి వాటిపై ఏఎస్‌ఐ ఆరోన్ అవగాహన కల్పించారు. వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచ్ పకీరప్ప పంచాయతీ కార్యదర్శి కనకరాజు, హన్మంత్‌నాయక్, కమ్లిబాయి, గలజప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

కోస్గి(మద్దూరు): వేసవి కాలంలో నర్సరీలను సంరక్షించుకోవాలని మొక్కలపై నీడను ఏర్పాటు చేసుకోవడం, ఉదయం, సాయంత్రం సమయాల్లోనే మొక్కలను నీటిని అందించాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. శనివారం మండలంలోని చంద్ర్యనాయక్‌తాండా, పలెర్ల, నందిపాడ్ గ్రామాల్లోని నర్సరీలను ఉపాధి ఏపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. అక్కడి నుంచి నందిపాడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎజెన్సీ మహిళలకు సూచించారు. పాఠశాలలో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే గ్రామాల్లో ఉపాధి పనులో కూలీల సంఖ్య పెంచాలని టీఏలకు అదేశించారు.

కుల గణనకు చట్టబద్ధత కల్పించాలి



కోస్గి: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీమేరకు శాసన సభలో కుల గణనకు తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించడం స్వాగతిస్తున్నామని, కుల గణనకు చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత సైతం ప్రభుత్వానిదేనని బీసీ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. కుల గణనకు చట్ట రూపం కల్పించే ముందు అన్నిరాజకీయ పార్టీలు, బీసీ సంఘాల నాయకులు, మేధావులతో కూడిన అఖిలపక్షం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కుల గణన తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై సీఎం రేవంత్‌కు అన్నివర్గాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షుడు కేశవులు, నాయకులు వెంకటేశ్వర్లు, బస్వరాజ్, వెంకటయ్య, భీమరాజు, నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

మక్తల్: బీసీ కులగణన చేసేందుకు కాంగ్రెస్‌కే సాధ్యమైందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. కుల గణన తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కోళ్ల వెంకటేష్, గణేష్ కుమార్, లక్ష్మన్, రామలింగం, కావలి శ్రీహరి, నారాయణ, నాగేందర్, శ్రీనివాసప్, కల్లూరి గోవర్ధన్, రవి పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఊట్కూర్: మండలంలోని పెద్దజట్రం ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు విద్యార్థులు హెచ్‌ఎంగా నందిని, ఎంఈఓగా ముబ్బషిర్, డీఈఓగా రాకేశ్, కలెక్టర్ నందిని విధులు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనంజయ, కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కతలప్ప, గ్రామస్తులు హన్మంతు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి హరితారెడ్డి

కోస్గి: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని సర్జఖాన్‌పేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి హరితారెడ్డి సూచించారు. ఈ మేరకు శనివారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒత్తిడిని జయించి ఉన్నత ఫలితాలు సాధించే అంశంపై అవగాహన నిర్వహించారు. సమయ పాలన, నిర్దేశిత లక్ష్యం, పరీక్షలంటే భయం కాకుండా ఇష్టంతో చదవడం వంటి పనులతో ఒత్తిడిని సులభంగా జయించవచ్చునన్నారు. అనంతరం పరీక్షల్లో ఒత్తిడి లేకుండా ఉన్నత ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శివపడిపూజ



మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో శివస్వాములు ఘనంగా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మెట్లపూజ, పంచామృతాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి శివమాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, శివభక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



మరికల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ జయమ్మ

మరికల్: మండలంలోని పస్పులలో శనివారం సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ జయమ్మతోపాటు ప్రత్యేక అధికారి అరవింద్ ప్రారంభించారు. ఎన్‌ఆర్‌జీఎస్ కింద సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. పనులు చేసేవారు నాణ్యతతో చేయాలని సూచించారు. గ్రామంలో అవసరమైన దగ్గర సీసీరోడ్లు వేస్తామన్నారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీ జయమ్మ, మాజీ సర్పంచ్ మహదేవమ్మ, రాజు, సూర్యమోహన్, రవిగౌడ్, లింగం గౌడ్, వీరన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని దేశాయ్‌పల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన సీసీరోడ్డు నిర్మాణం పనులను శనివారం మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప సమక్షంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పనులను ప్రారంభించారు. సకాలంలో పనులు పూర్తి చేస్తే ఆయా కాలనీ ప్రజలకు ఎంతో సౌకర్యం కల్గుతుందన్నారు. ప్రభుత్వం ఎన్‌ఆర్ ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేయడంపై పనులు ప్రారంభించడంతో కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయులు బాల్‌రెడ్డి, శరణ్యనాయక్, శ్రీనివాస్, ఖాజా, తంబలి రఘు, రాములు, నరేందర్‌గౌడ్, నర్సింహులు, విఠల్‌గౌడ్, వెంకటయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలి సభ్యులకు సన్మానం



మరికల్: ఐదేళ్ల పాటు సేవలు అందించిన మాజీ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం ఘనంగా సన్మానించారు. యువక మండలి భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ సర్పంచ్ గోవర్ధన్‌తోపాటు మాజీ ఉప సర్పంచ్ శివకుమార్, మాజీ వార్డు సభ్యులను సత్కారించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భారతమ్మ, స్వరూప, రాజ్యలు, బాలమణి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి నోచుకోని అమరచింత

అమరచింత: పట్టణంలో కొన్నేళ్లుగా గ్రంథాలయం మూత పడి ఉన్నా మున్సిపల్ అధికారులు, పాలక మండలి పట్టించుకోవడం లేదు. పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని గదిని కేటాయించినా.. నిర్వహణ భారంతో మూతపడింది. గతంలో అమరచింత గ్రామంగా ఉన్నప్పుడు కొంతమంది యువకులు స్వచ్ఛందంగా గ్రంథాలయం పునరుద్ధరణకు విరాళాలు సేకరించి ప్రతి నెల దినపత్రికలతో పాటు విజ్ఞానికి సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం దాతలు ముందుకు రాకపోవడంతో నిర్వహణ భారమై గ్రంథాలయం మూత పడింది. ఇప్పటికైనా పాలకవర్గం స్పందించి గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అపర భగీరథుడు కేసీఆర్



పేటలో కేక్ కట్ చేస్తున్న కార్యకర్తలు, నాయకులు



మక్తల్‌లో ..

నారాయణపేట: పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలోని శనివారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, సీనియర్ నాయకులు గందె చంద్రకాంత్ కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. విండో అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ సరాఫ్ నాగరాజు, మాజీ వైస్ చైర్మన్ కన్నాజగదీశ్, చెన్నారెడ్డి, వేపూరి రాములు, చంద్రశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మక్తల్: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా శనివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్‌కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. మార్కెట్ నర్సింహాగౌడ్, మహిపాల్‌రెడ్డి, రాములు, మొగులప్ప, రాజుల ఆశిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అన్వర్, అమరేందర్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో బంగారు తెలంగాణకు శ్రీకారం చుట్టి అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. మండ్ల చిన్నయ్య, అయ్యప్ప, వెంకటేశ్వర్‌రావు, డా.శంకర్, ఆంజనేయులు, రాజారెడ్డి పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని శనివారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పళ్లను పంపిణీ చేశారు. తిరుపతయ్య, శేఖర్, కృష్ణారెడ్డి, రాజేష్, రాజవర్ధన్‌రెడ్డి, రామస్వామి, గోపి, గోపాల్, బసంత్, రవి, కృష్ణయ్య, జగదీశ్, నర్సింహులు పాల్గొన్నారు.

మద్దూరు: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని మండలంలోని అతిథిగృహం ఆవరణలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు సలీం, వెంకటయ్య, వీరారెడ్డి, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, రాములు, బసప్ప, చంద్రశేఖర్, వెంకట్‌రాములుగౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఊట్కూర్: మండలంలోని స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఎం. బాల్‌రెడ్డి, అరవింద్‌కుమార్, లక్ష్మారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మోహన్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, నర్సింహారాజు పాల్గొన్నారు.

వైభవంగా పాల ఉట్లు



మక్తల్: మండలంలోని మాద్వార్‌లో గట్టుతిమ్మప్పస్వామి (లక్ష్మీవెంకటేశ్వర స్వామి) పాల ఉట్ల కార్యక్రమం శనివారం సాయంత్రం భక్తులు గ్రామం నుంచి ఊరేగింపుగా వెళ్లి వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. భక్తులు అడుగుల భజనలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పాల ఉట్ల కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. పాలు ఉట్లను మాద్వార్‌కు చెందిన క్షిరప్ప అనే యువకుడు ఉట్టిని కొట్టారు. ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు చేతుల మీదుగా బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో తదితరులు భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత అన్నారు. శనివారం స్థానిక శ్రీపడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. కౌన్సిలర్ రాధిక, శేషగిరి, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, గోవర్ధన్ పాల్గొన్నారు.